## క్లుప్తంగా

### విద్యుత్ లైటింగ్ ప్రారంభం



మరికల్: మండలంలోని తీలేర్ స్టేజీ నుంచి గ్రామం వరకు పంచాయతీ నిధుల కింద ఏర్పాటు చేసిన లైటింగ్‌ను సర్పంచ్ రేవతమ్మ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ నిధుల కింద స్టేజీనుంచి గ్రామం వరకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేసి లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఆలయ ముఖద్వారానికి కూడా విద్యుత్ లైటింగ్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### గ్రామస్తుల అభినందన

ధన్వాడ: మండలంలోని మంత్రోనిపల్లి గ్రామానికి చెందిన ఆశానాళ్ల భవాని నిరుపేద యువతి స్టాఫ్ నర్స్‌గా ఎంపికయ్యారు. ఈమె కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఉన్నత విద్యను అభ్యసించారు. నర్సింగ్ ట్రైనింగ్ చేసిన ఈమె స్టాఫ్ నర్సుగా ఎంపిక కావడంపై గ్రామ సర్పంచ్ సాంతమ్మ, గున్ముక్ల ఎంపీటీసీ సుధీర్‌కుమార్ అభినందించారు.

### అక్రమ షెడ్ల తొలగింపు



మరికల్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ప్రభుత్వ స్థలంలో అక్రమంగా షెడ్లు, తోపుడు బండ్లను పెట్టి అద్దె వసూలు చేస్తున్న విషయాన్ని ఈ నెల 28న ప్రభుత్వ స్థలంలో అక్రమ అద్దె వసూలు అనే వార్తను ప్రచురించడంతో ఇందుకు స్పందించిన కార్యదర్శి వాటిని తొలగించారు. ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో డబ్బాలు, షెడ్లు, తోపుడుబండ్లను పెట్టి చిరు వ్యాపారులకు అద్దెకు ఇచ్చిన వారి వివరాలను సేకరించి వాటిని గ్రామ పంచాయతీ సిబ్బందితో తొలగించామన్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా అద్దెలు వసూలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

### ఆస్పత్రిలో పండ్ల పంపిణీ



నారాయణపేట రూరల్: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, నారాయణపేట ప్రాంత సీనియర్ నాయకుడు జాజాపూర్ సిద్రామప్ప వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లా ఆస్పత్రిలో ఆ పార్టీ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రఘువీర్‌యాదవ్ మాట్లాడుతూ.. సిద్రామప్ప సామాన్య కార్యకర్త నుంచి రాష్ట్ర నాయకుడిగా ఎదిగి, పార్టీ పటిష్టతకు ఎంతో కృషిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో అశోక్, సైదప్ప, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### పాదయాత్రకు తరలిరండి



కృష్ణా: కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి ప్రారంభించనున్న పాదయాత్రకు ముఖ్య అతిథిగా ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనరసింహ హాజరవుతున్నట్లు కో–ఆర్డినేటర్ రాహుల్ తెలిపారు. మంగళవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కున్సిరాజప్పగౌడ నివాసంలో నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేసి పాదయాత్రకు సంబంధించిన విషయాలను చర్చించారు. బుధవారం ఉదయం మండలం నుంచి పాదయాత్రను మంత్రి ప్రారంభించి వంశీచందర్‌రెడ్డితో కలిసి హిందుపూర్ వరకు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. పాదయాత్రలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు చైతన్య రెడ్డి, శాబుద్దీన్, వంశీ, పల్లె సురేష్, అంజప్పగౌడ, శివప్పసాకార్, కృష్ణమూర్తి ఉన్నారు.

### కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. మంగళవారం తన చాంబర్‌లో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల జిల్లా సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సర్పంచుల పదవీ కాలం ముగుస్తున్నందున కార్యదర్శులు పూర్తి అప్రమత్తతతో పని చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకట్‌స్వామి, ఉపాధ్యక్షుడు జంగీర్, కోశాధికారి నాగరాజు పాల్గొన్నారు.

# ఆక్రమణలతో అవస్థలు

- రహదారులు, డ్రెయినేజీపైనే నిర్మాణాలు
- అద్దెతో ఆదాయం పొందుతున్న వైనం
- కుదించుకుపోయిన రోడ్లతో వాహనదారుల ఇక్కట్లు
- నిత్యం ప్రమాదాలతో ప్రాణాలు కోల్పోతున్న గ్రామస్తులు



మాగనూర్ బస్టాండ్ చౌరస్తాలో రోడ్లపైకి వచ్చిన చిరువ్యాపారులు (ఫైల్)

మాగనూర్: మండల కేంద్రంలో ఉండే బస్టాండ్, పాఠశాల ప్రాంతాల్లో రహదారులు ఆక్రమణకు గురికావడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. వ్యాపార కేంద్రంగా నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంది. రహదారులు, డ్రెయినేజీలపై కొందరు వ్యాపారులు నిర్మాణాలు చేపట్టారు. కొందరు సొంతంగా వ్యాపారం చేస్తుండగా.. మరి కొందరు అద్దెకు ఇచ్చారు. బస్టాండ్ చౌరస్తా నుంచి ఇటు బ్యాంక్ వరకు అటు అంబేడ్కర్ చౌరస్తా వరకు డ్రెయినేజీలపై, వాటిని కూడా దాటి రహదారులపైకి నిర్మాణాలు ఉన్నాయి. చాలా మంది వ్యాపారులు తమ షాపులను దాటి సరకులను రోడ్డుకు అనుకుని పెడుతుండడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. అలాగే ఈ రోడ్డు వెంబడి చిరు వ్యాపారులు, తోపుడు బండ్లు ఏర్పాటు చేయడంతో రహదారులు కుదించుకుపోయాయి. ఆక్రమణలకు గురై ఇరుకుగా మారిన ఈ రోడ్లలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

**ఆటోలోలు సైతం..**

నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ చౌరస్తాలో వ్యాపారస్తుల ఆక్రమణకు తోడు ఆటోవాలలు ఇష్టారాజ్యంగా రోడ్లపై ఆటోలు నిలుపుతుండటంతో సమస్య మరింత కఠినంగా మారిందని చెప్పవచ్చు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల ఆక్రమణను తొలగించి గ్రామస్తుల ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

### ప్రమాదాలను నివారించాలి



గతంలో కంటేరోడ్డు వెడల్పు అయింది. ప్రయాణికుల కష్టాలు తొలుగుతాయనుకునే లోపే రోడ్ల ఆక్రమణతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాలను నివారించాలి.

– నర్సింహులు, మాగనూర్ గ్రామస్తుడు

### చర్యలు తీసుకుంటాం



బస్టాండ్ చౌరస్తాతో పాటు ప్రధాన కూడలిలో జరుగుతున్న ఆక్రమణలను తొలగించేందుకు వెంటనే చర్యలు ప్రారంభిస్తాం. ఒకవేళ వారు సహకరించకపోతే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారు.

– రాజు, గ్రామ సర్పంచ్ మాగనూర్

### తొలగిస్తాం



రోడ్డు విస్తీర్ణ సమయంలో గ్రామస్తులు సహకారం లేక రోడ్డు అనుకున్న దాని కంటే తక్కువ వెడల్పునిర్మాణం చేయడంతో పాటు ప్రస్తుతం చిరు వ్యాపారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వారికి చెప్పి వాటిని అక్కడి నుంచి తొలగిస్తాం. వినకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– అమీర్, ఇన్‌చార్జి తహసీల్దార్ మాగనూర్

# విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

నర్వ: పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ వెంకటయ్య అన్నారు. మంగళవారం జక్కన్నపల్లి పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదిలోని విద్యార్థుల వద్దకు వెళ్లి ఆయన పాఠాలను చదివించారు. వారి సామర్థ్యాల పెంపునకు తీసుకోవాల్సిన అంశాలను ఉపాధ్యాయులకు సూచించారు. ఉన్నతి కార్యక్రమం ద్వారా ఎప్పటికప్పుడు విద్యార్థుల్లో సామర్థ్యాలు, సృజనాత్మకత, పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ హెచ్‌ఎం నర్సింహులు, సీఆర్పీ నర్సింహులు, ఉపాధ్యాయురాలు సత్యనారాయణమ్మ పాల్గొన్నారు.

# పద్మశ్రీ కొండప్పకు సన్మానం



కొండప్పను సన్మానిస్తున్న మాజీ జెడ్పీటీసీ కుటుంబసభ్యులు

దామరగిద్ద: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించి అత్యున్న పురస్కారాల్లో ఒకటైన పద్మశ్రీ అవార్డు దాసరి కొండప్పకు దక్కడం గ్రామానికి గర్వకారణమని మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటప్ప, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు భీమయ్యగౌడ్ అన్నారు. అనంతరం వారు కొండప్పను సత్కరించారు. ఆయన బుర్రవీణా కళా నైపుణ్యంతో అవార్డు రావడంతో గ్రామం పేరు యావత్ దేశానికి తెలిసేలా చేసిందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రావణ్‌కుమార్, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కుష్టువ్యాధి నివారణకు కృషి చేయాలి



కుష్టువ్యాధి నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

మాగనూర్: కుష్టు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారిణి విరోజ పేర్కొన్నారు. వికసిత్‌భారత్ కార్యక్రమంలో భాగంగా జెడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేశారు. గ్రామాల్లో కుష్టు వ్యాధి ప్రబలకుండా ప్రజలు వాధినివారణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో కేసులు త్వరితగతిన గుర్తించి సత్వర చికిత్సలు చేయించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే కుష్టు వ్యాధి సోకిన వారి పట్ల ఏలాంటి వివక్ష చూపరాదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, సూపర్‌వైజర్ వెంకటేష్‌గౌడ్, ఏఎన్‌ఎం సుధా, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### కొల్లూరులో న్యాయ విజ్ఞాన సదస్సు



ఊట్కూరు: కొల్లూరులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ దత్తాత్రేయ మాట్లాడుతూ.. ప్రజలు వారి హక్కుల గురించి న్యాయ విజ్ఞాన సదస్సు ద్వారా సమస్య పరిష్కారం పొందొచ్చన్నారు. ఉచిత న్యాయ సహాయం, చట్టాలపై అవగాహన కల్పించడం తమ సంస్థ ద్వారా జరుగుతుందన్నారు. అనంతరం ప్రజలకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సరోజా సంవృద్ధి, న్యాయవాదులు సూర్యప్రకాశ్, సురేందర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

### ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు



మరికల్: మండల కేంద్రంలోని పురాతన ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం నుంచి భక్తులు నిత్య పూజలను ప్రారంభించారు. గ్రామస్తుల్లో భక్తిభావం పెంపొందించేందుకు ప్రతి నిత్యం ఆంజనేయస్వామికి పూజలు చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు హనుమాన్‌వాడ భక్త మండలి సభ్యులు తెలిపారు. రోజు తెల్లవారుజామున జరిగే నిత్య పూజలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని సూచించారు.

# మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడుద్దాం

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



ఊట్కూరులో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి


ఊట్కూరు: మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడుద్దామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మండలంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆయన ఆశయాల సాధనకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానని ఎమ్మెల్యే అన్నారు. సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ఎల్కోటి నారాయణరెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎల్కోటి జనార్దన్‌రెడ్డి, సభ్యులు గోపాల్‌రెడ్డి, కుర్వ అంజప్ప, శంకర్, వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

మక్తల్: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఘనంగా నిర్వహించారు. అనంతరం అర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మాగాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు శ్రీనివాస్‌గుప్తా, భాస్కర్, వెంకటేష్, కట్టసురేష్, నారాయణ, నాగరాజ్, హరికృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

కోస్గి: మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని రామాలయం వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి మంగళవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. గాంధీజీ ఆశయ సాధన కోసం పనిచేయాలని సంఘం అధ్యక్షుడు చల్ల శ్రవణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి బీచ నరేందర్, కో శాధికారి వీరేశం, సభ్యులు చల్లా వెంకటేష్, గోపాల్, శ్రీరాములు, సుర్యనారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కోస్గి: (మద్దూరు) కొత్తపల్లి మండల కేంద్రంలోని నరేష్, శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతిని పాఠశాల విద్యార్థులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయసాధన కోసం మనమందరం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు చందు, రామకృష్ణ, జాజ, బాబమ్మ పాల్గొన్నారు.

మరికల్: మండల వర్తక వాణిజ్య వ్యాపార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి చేసిన సేవలను కొనియడారు. అనంతరం బాటసారులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యానారాయణశెట్టి, ఆనంద్, శ్రీనివాస్, రమేష్, రాజేశ్వర్‌రెడ్డి, వీరన్న, హరిష్, రామకృష్ణ, నాగరాజ్, సోమనాథ్ పాల్గొన్నారు.




మద్దూర్‌లో..

### మహాత్మాగాంధీజీకి ఘన నివాళి



విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: మహాత్మాగాంధీ వర్ధంతిని మంగళవారం పట్టణం, మండలంలోని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు గాంధీజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ సేవలను కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని సూచించారు. అలాగే వివిధ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో గాంధీజీకి నివాళులర్పించారు.



మరికల్‌లో..



మక్తల్‌లో ..

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అమ్మిరెడ్డిపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ

నారాయణపేట రూరల్ : మత్తు పదార్థాలకు దూ రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని ఏఎస్‌ఐ సంజీవయ్య అన్నారు. మంగళవారం మండలంలోని అమ్మిరెడ్డిపల్లిలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తుపదార్థలు తీసుకోవడంతో కలిగే అనర్థాలను వివరించారు. అదేవిధంగా సైబర్ నేరాల వలలో పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. విపత్తు నివారణ చట్టం అమలులో ఉన్నందున నిబంధనలు ఉల్లంఘిస్తే రూ. వెయ్యిజరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. అలాగే మండలంలోని జాజాపూర్ జెడ్పీ స్కూల్‌లో రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ.. మహిళలు, బాలికలతో ఎవరైన ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100 హెల్ప్ లైన్ నంబర్ కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే వాహనాలపై ఉన్న పెండింగ్ చాలన్లను చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. పట్టణంలోని వాహనదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో పోలీసులు అశోక్, ప్రదీప్, మల్లికార్జున్, సిబ్బంది వెంకటేష్, సాయికుమార్, శ్యాంకుమార్, హెచ్‌ఎం కనకప్ప, మాధవి, విజయ్‌కుమార్, భానుప్రకాష్, తిరుపతి, భగవంతు పాల్గొన్నారు.

# బీమా పథకంపై అవగాహన



బాధిత మహిళకు చెక్కును అందజేస్తున్నమేనేజర్

మరికల్: మండ కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో మంగళవారం మేనేజన్ శ్రీనివాస్‌రాథోడ్ ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా పథకంపై బ్యాంక్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన అనిల్‌కుమార్ అనే యువకుడు పథకంలో సభ్యత్వం తీసుకొని ఇటీవల మృతి చెందడంతో నామిని తల్లి సత్యమ్మకు రూ. 2లక్షల చెక్కును అందజేశారు. బీమా పథకంలో చేరిన వారు ఎడాదికి రూ. 436 చెల్లించాల్సింటుందన్నారు. బ్యాంక్ ఖాత కలిగిన ప్రతి ఒక్కరూ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది జగత్‌ప్రసాద్, అవినాష్, సువకార్, జగదీష్, నరేష్, మల్లేష్ పాల్గొన్నారు.

# ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం



పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించడమే తన లక్ష్యమని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిట్టెం రామ్మోహన్‌రెడ్డి – సుచరిత దంపతులను బీఆర్‌ఎస్ నాయకులు శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ వనజ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాగౌడ్, రాజేష్‌గౌడ్, జెడ్పీటీసీ వెంకటయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, గాలిరెడ్డి, ఎల్లారెడ్డి, అన్వర్, మహిపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలో 2006లో 1,200 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చినా.. నేటి వరకు స్థలాలు కేటాయించలేదని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజుకి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, సీపీఎం నాయకులు బుచ్చన్న, భారతీయుడు, ఇస్మాయిల్, కుర్మన్న మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారన్నారు. పదేళ్ల అనంతరం మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, ఇప్పటికైనా 1,200 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు చూపించి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేయాలని కోరారు.

### ప్రభుత్వ స్థలాలను కాపాడండి



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అమరచింత: మున్సిపాలిటీలోని ప్రభుత్వ స్థలాలను కాపాడాలంటూ బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ కొత్త బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న కందకం స్థలంతో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ స్థలాల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అంతే కాకుండా పట్టణంలోని ఆయా వార్డుల్లో ఉన్న గౌటన్ భూములను సైతం పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో నరాల సిద్ధురాములు, పద్మయ్య, మహేష్, రఘు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



### పట్టణ అధ్యక్షుడిగా రఫీఖ్

ఆత్మకూర్: పట్టణ కాంగ్రెస్ మైనార్టీసెల్ అధ్యక్షుడిగా మహ్మద్ రఫీఖ్‌ను నియమిస్తూ మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, టీపీసీసీ రాష్ట్ర కళ్లగీత డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేషం నాగరాజుగౌడ్ నియామక పత్రం అందించారు. తనను పట్టణ మైనార్టీ అధ్యక్షుడిగా నియమించడంపై రఫీఖ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.



### చిట్టెం దంపతులకు సన్మానం

నర్వ: మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలకు మండలంలోనిఆయా గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు మక్తల్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా చిట్టెం దంపతులను శాలువా, పూలమాలతో సత్కరించారు. మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, నాయకులు లక్ష్మన్న, చిన్నయ్య, అయ్యప్ప, హన్మంత్‌రెడ్డి, శంకర్, శ్రీకాంత్‌రెడ్డి, రాములు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.